క్లుప్తంగా...

నేడు మంత్రి పర్యటన

కీసర: కీసరలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం తోపాటు, గోడాన్ ప్రారంభోత్సవానికి మంత్రి మల్లారెడ్డి సోమవారం విచ్చేయనున్నట్లు కీసర రైతు సహకార సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి సొసైటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయండి

మేడ్చల్: నగరంలోని సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న నిరుద్యోగ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని పీసీసీ అధికార ప్రతినిధి, నియోజకర్గ కో ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి కోరారు. నియోజకర్గంలోని కార్యకర్తలు, నాయకులు, యువకులు మధ్యాహ్నం వరకు కీసరలోని కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకుని, అక్కడి నుంచి సభకు ర్యాలీగా వెళ్లాలని ఆయన కోరారు. సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేతలు



పటోళ్ల విక్రంరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన కరీంగూడకు చెందిన బీఆర్ఎస్ నేతలు

కీసర: కేంద్రంలోని నరేంద్రమోదీ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ గ్రామాల్లో ప్రజలు, యువత పెద్ద ఎత్తున బీజేపీలో చేరుతున్నట్లు మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కరీంగూడకు చెందిన బీఆర్ఎస్ నేతలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, వంగేటి బాపిరెడ్డి, కోల బాల్‌రాజ్, కొలిచెలిమి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి మంత్రి పూజలు



పూజలు చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: ఏదులాబాద్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన గ్రామ దేవతలకు బోనాలు, బొడ్రాయి పండగ కార్యక్రమాల్లో మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కుమార్ ముదిరాజ్, ధర్మారెడ్డి, శంకర్, శ్రీను, రాజు, బాల్‌రాజ్, కొండల్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్య ప్రాముఖ్యతపై అవగాహన



మేడ్చల్: ముస్లిం యువతులకు బాలికల విద్య ప్రాముఖ్యతపై మేడ్చల్‌లో అవగాహన కల్పించారు. పట్టణంలోని ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ కలాం ఉచిత గైడెన్స్, కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. యువతులకు, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతపై వివరించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ రవిత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్ దానియేలు

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో వైఎస్సార్‌టీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా నియోజకవర్గ కో ఆర్డినేటర్ పాకాల దానియేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ ఆశయ సాధన కోసం పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు, తాడికొండ అశోక్, జయరాజ్, కాంతారావు, కొండూరి శ్రీనివాస్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అన్ని పార్టీల్లో.. అంతర్గత పోరే



- ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకుల్లో పోటీ
- టికెట్ సాధనపై ఎవరి గ్రూపులు వారివే..
- ప్రతీ ఎన్నికలో మేడ్చల్‌వాసుల విలక్షణ తీర్పు

మేడ్చల్: రాష్ట్ర అసెంబ్లీకి ఈ ఏడాది ఎన్నికలు జరగనుండటంతో ఎమ్మెల్యేగా పోటీ చేసి మేడ్చల్ నుంచి ఎమ్మెల్యే కావాలని కొంతమంది నాయకులు, స్థానాన్ని తిరిగి నెలబెట్టుకోవాలని మరి కొంతమంది నాయకులు రాజకీయాలు మొదలు పెట్టారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలతో కలిసి ఉన్న మేడ్చల్ ప్రజలు ప్రతీ ఎన్నికలో విలక్షణ తీర్పు ఇస్తున్నారు. నాలుగు లక్షలకు పైగా ఓటర్లు ఉన్న మేడ్చల్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే అభ్యర్థులకు అంగబలం, అర్థబలం ఉండి తీరాల్సిందే..

అన్ని పార్టీల్లో అంతర్గత పోరే..

ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో టికెట్లు ఆశించే నాయకులు ఒకరి కంటే ఎక్కువగా ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి మేడ్చల్‌కు మంత్రి మల్లారెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. మూడు పార్టీల నుంచి ఎనిమిది మంది బలమైన నాయకులు ఈ ఎన్నికల్లో ప్రధాన మూడు పార్టీల్లో టికెట్ కోసం పోటీపడుతున్నారు. మూడు టికెట్ల కోసం 8మంది పోటీలో ఉన్నారు. సీజన్ ప్రారంభం నాటికి మరి కొంతమంది వలస నాయకులు, జంప్ జలానీలు జాబితాలో చేరతారు.

బీఆర్ఎస్‌లో ముగ్గురు..

తెలంగాణ ఏర్పడ్డ తొలినాళ్లలో ఎమ్మెల్యేగా సుధీర్‌రెడ్డి ఉన్నారు. గత ఎన్నికల్లో మల్లారెడ్డి తన టికెట్ బలవంతంగా చివరి నిమిషంలో లాక్కున్నారని, ఈసారి టికెట్ తనదేనని ఆయన పలు సమావేశాల్లో చెబుతున్నారు. టికెట్ ఈసారి తనదేనని సీఎం కేసీఆర్ తనకు ఇప్పటికే ఖరారు చేశారని మంత్రి మల్లారెడ్డి బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. ఇద్దరి మధ్య టికెట్ పోరు జోరుగా సాగుతోంది. సుదీర్‌రెడ్డి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆయన కుమారుడు శరత్‌చంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌గా ఉండి తమ గ్రూపు రాజకీయం జోరుగా సాగిస్తున్నారు. మంత్రి మల్లారెడ్డి పార్టీలో 80శాతం నాయకులను తన గుప్పిట్లో పెట్టుకుని తన స్టైల్ రాజకీయం చేస్తున్నారు. టీడీపీ హయాంలో కీలకంగా ఉండి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గత ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి ఓటమి పాలైన నక్క ప్రభాకర్‌గౌడ్ బీఆర్ఎస్ మేడ్చల్ టికెట్ ఆశిస్తున్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి శిష్యుడిగా పేరు పొందిన ఆయన ఈసారి టికెట్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో జోరుగా..

కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఎన్నికల్లో గ్రూపు రాజకీయం కనబడటం సాధారణం. నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి మూడుసార్లు పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ ఎమ్మెల్యేగా ఓడిపోయాక నియోజకవర్గ రాజకీయానికి కాంగ్రెస్‌కు దూరంగా ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అయ్యాక ధిక్కార స్వరం వినిపించి కాంగ్రెస్‌లో కనుమరుగయ్యారు. ఎన్నికల సీజన్ కావడంతో తిరిగి రేస్‌లోకి వచ్చాడు. నియోజకవర్గ సీనియర్ రాజకీయ నాయకులు హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌లు ఈ సారి ఎన్నికల్లో టికెట్ సాధించేందుకు ఇద్దరు నేతలు ఎంపీ రేవంత్ రెడ్డిని నమ్ముకుని రాజకీయం చేస్తున్నారు. ఇద్దరు నేతలు నియోజకర్గంలో ఎవరికి వారుగా విడిపోయి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హరివర్ధన్‌రెడ్డి జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌గా ఉండి జోరుగా కార్యక్రమాలు చేస్తున్నారు.

బీజేపీలో ఎవరో..?

బీజేపీలో మేడ్చల్ అభ్యర్థిగా నాలుగు సార్లు పోటీ చేసి ఓడిపోయిన కొంపల్లి మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డిలు ఈ సారి పార్టీ బీఫారం ఆశిస్తున్నారు. ఆ పార్టీ అధినాయకత్వం వలస నాయకులను నమ్ముకోవడంతో ఎన్నికల సమయానికి ఏ నాయకుడు ఏ పార్టీ నుంచి వచ్చి చేరుతాడో.. టికెట్ ఎవరికి వస్తుందో ఎన్నికల వరకు సస్పెన్స్‌గానే ఉంటుంది. మిగతా పార్టీలైన బీఎస్పీ, వామపక్షాలు పార్టీ అభ్యర్థుల వేటలో ఉన్నాయి.

అంతాబలమైన వారే..

- మేడ్చల్ నుంచి అన్ని పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న వారు తమకు నియోజకవర్గంలో ఎంతోకొంత ఫాలోయింగ్ ఏర్పర్చుకున్న వారే.. పోటీలో బీఆర్ఎస్ నుంచి మంత్రి మల్లారెడ్డి, సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ నుంచి హరివర్ధన్‌రెడ్డి, కేఎల్ఆర్, జంగయ్యయాదవ్, బీజేపీ నుంచి మోహన్‌రెడ్డి, విక్రంరెడ్డి అంతా అర్థ బలం ఉన్న వారే.. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇతర వ్యాపారాల్లో వందల కోట్లు సంపాందించిన వారే. ఈ జాబితాలో విక్రంరెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ అర్థ బలంలో వెనుకబడి ఉన్నారు. మిగతా నేతలు ఎవరికీ వారు తీసిపోని విధంగా ఉన్నారు.
- కేఎల్ఆర్, మల్లారెడ్డి అర్థ బలంలో టాప్‌లో ఉండగా మిగతా వారు వారిని ఫాలో అవుతున్నారు. అన్ని పార్టీలలో టికెట్ల కోసం ఆశిస్తున్న వారిలో బీజేపీ విక్రంరెడ్డి మినహా మిగతా నేతలు వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన వారే.. కేఎల్ఆర్, సుధీర్‌రెడ్డిలు మాజీ ఎమ్మెల్యేలు కాగా హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, మోహన్‌రెడ్డిలు పలుమార్లు పోటీ చేసి ఓటమి చూసి రాజకీయాల్లో నిలబడ్డారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలతో పాటు కీసర మండలానికి చెందిన ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే డంపింగ్ యార్డును ఎత్తివేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం దమ్మాయిగూడ డంపింగ్‌యార్డు జేఏసీ ఆధ్వర్యంలో దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం నుంచి జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు 3కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డుకు నిత్యం 8 వేల వాహనాలతో చెత్తను తరలించి ఇక్కడి ప్రాంతాన్ని విషపూరితంగా తయారు చేస్తున్నారని దుయ్యబట్టారు. జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డు వల్ల ఇక్కడి గాలి, నీరు పూర్తిగా కలుషితం అయ్యాయని, ఇక్కడి ప్రజలకు తాగునీటికి కూడా ఇబ్బందులు ఉన్నాయన్నారు. రాత్రివేళలో దుర్వాసన, దోమలు, ఈగల బెడద అధికంగా ఉందని, దీంతో ఇక్కడి ప్రజలు తరచూ రోగాల పాలవుతున్నారని అన్నారు. చెత్త డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి ప్రజలకు తాను అండగా నిలవనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలను కూడా సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో కూడా కేసువేసి ఇక్కడి ప్రజలకు మేలు జరిగేవిధంగా పోరాటం చేస్తామన్నారు. 3కె వాక్‌లో దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్ప రామారావు, ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఏనుగు సంజీవరెడ్డి, నల్ల మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం, సోమేష్, శోభారాణి, కృష్ణారావు, ఈగ శ్వేతరాజు, మొర్గు సునీత, పరమేష్, కిరణ్‌కుమార్, గడ్డం శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



3కె వాక్‌లో టీపీసీసీ కార్యదర్శి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి తదితరులు

క్రీడారంగంలోనూ నైపుణ్యత కలిగి ఉండాలి

జవహర్‌నగర్: యువత చదువుతో పాటు క్రీడారంగంలో కూడా నైపుణ్యత కలిగి ఉండాలని 20వ డివిజన్ కార్పొరేటర్ కుతాడి సాయికుమార్ అన్నారు. జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ కుతాడి సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన షార్ట్ పిచ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతలుగా అంబేడ్కర్‌నగర్ రౌడీబాయ్స్ టీమ్, రన్నర్స్‌గా నేరెడ్‌మెట్ టీమ్‌లు గెలుపొందారు. అనంతరం విజేతలకు కార్పొరేటర్ కుతాడి సాయికుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ సాయికుమార్

అంబేడ్కర్ ఆశయాలను ఆచరిద్దాం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నానావత్ శివాజీ

ఘట్‌కేసర్: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నానావత్ శివాజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ వంటి మహనీయుని నిత్యం స్మరించుకోవాలన్నారు. అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు మేకల దాస్, జి.అంజయ్య, ఆనంద్, జ్ఞానేందర్, జగదీష్, వినోద్, మహేష్, అర్జున్ పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లో శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రథోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారికి దూపదీపాలతో స్వాగతం పలికి దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత శ్రీనివాస్, ఎంపీటీసీ రామారావు, ఆలయ చైర్మన్ వేణుగోపాల్, ఈఓ భాగ్యలక్ష్మి, నిర్వాహకులు శంకర్, జంగయ్య, అరవింద్, వెంకటేశ్‌గౌడ్, హరీష్, కృష్ణ, బాలరాజ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో ప్రజాప్రతినిధులు, భక్తులు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి



కీసర: అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కీసరలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బలగం సినిమా నటుడు సుధాకర్‌రెడ్డి (కొమురయ్య) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు మొర్గు రవీందర్, నేతలు శ్రీనివాస్, రమేష్‌గుప్తా, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పూడూర్‌లో భూవివాదం

వందల మంది జమ కావడంతో గ్రామంలో ఉద్రిక్తత

మేడ్చల్‌రూరల్: పూడూర్ గ్రామంలో విలువైన భూమి స్థల వివాదం రెండు వర్గాల మధ్య చోటు చేసుకోవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని సర్వే నంబర్ 6/2,6/3లోని మూడు ఎకరాల భూమి గ్రామ ప్రధాన రోడ్డులో ఉంది. కోట్ల రూపాయల విలువైన భూమి కావడంతో వివాదం 30 ఏళ్లుగా కొనసాగుతోంది. తాజాగా ఆదివారం రెండు వర్గాలు భూమి కబ్జా కోసం యత్నించి వందల మంది అనుచరులతో భూమి వద్దకు రావడంతో వివాదం జోరుందుకుంది. గ్రామానికి చెందిన తాళ్ల దర్శన్‌రెడ్డి కొన్నేళ్లుగా మూడు ఎకరాలపై కబ్జాలో ఉన్నాడు. ఆ భూమి అసలు పట్టాదారు నుంచి నగరానికి చెందిన రియల్ వ్యాపారులు భూమిని కొనుగోలు చేశారు. దీంతో సమస్య కొన్నేళ్ల క్రితం కోర్టుకు వెళ్లింది. న్యాయస్థానంలో తుది తీర్పు రియల్ వ్యాపారులకు అనుకూలంగా రావడంతో వారు ఆదివారం కబ్జాను తీసుకునేందుకు గ్రామానికి వచ్చి స్థలంతో తాత్కాలిక ఇనుప గదిని ఏర్పాటు చేశారు. దీంతో దర్శన్‌రెడ్డి కుటుంబీకులు రియల్ వ్యాపారులతో వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అక్రమంగా కబ్జాకు పాల్పడుతున్నారని దర్శన్‌రెడ్డి ఆరోపిస్తుండగా, భూమి తమకు న్యాయపరంగా వచ్చిందని రియల్ వ్యాపారులు చెబుతున్నారు. తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని వివరించారు. రియల్ వ్యాపారులు న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయాలని మేడ్చల్ పోలీసులను ఆశ్రయించి తీర్పు కాపీని, ఇతర దస్తావేజులను సమర్పించారు. గ్రామంలో ఒక్కసారిగా వందల మంది జమ కావడం ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో గ్రామస్తులు హడలిపోయారు. చట్టపరంగా తమకు అన్ని హక్కులు ఉన్నా కేవలం కబ్జాలో ఉండి తమ భూమిని తక్కువ ధరకు కొట్టేయాలనే ఆలోచనతో తమను దర్శన్‌రెడ్డి బెదిరిస్తున్నాడని రియల్ వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

సమ్మెలో కార్యదర్శులు.. ప్రజలకు తప్పని ఇక్కట్లు

- రెగ్యులరైజ్ డిమాండ్‌తో సమ్మెలో జేపీఎస్, ఏపీఎస్‌లు
- మొత్తం 61 పంచాయతీలు, సమ్మెలో 30 గ్రామాల కార్యదర్శులు
- 10 రోజులుగా ఇబ్బందుల్లో పంచాయతీ ప్రజలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగడంతో గ్రామాల్లో పాలన దాదాపుగా స్తంభించింది. ఇతర శాఖల ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగించినా.. కార్యదర్శుల లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సంక్షేమ పథకాల అమలులో జాప్యం, పారిశుద్ధ్య నిర్వహణలో ఆలస్యం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల అనుమతులు, అక్రమ కట్టడాల నివారణ, పల్లె ప్రగతి, హరితహారం, నర్సరీల పెంపకం, హైవే శానిటేషన్, జనన, మరణ, మ్యారేజి ధృవీకరణ పత్రాల జారీ వంటి విధులను పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాల్సి ఉండగా, సమ్మె కారణంగా స్తంభించి పోయాయి.

సమ్మె బాటలో 30 గ్రామాల కార్యదర్శులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలోనే 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 30 పంచాయతీలలో జేపీఎస్ (జూనియర్ పంచాయతీ సెక్రటరీ), ఓపీఎస్(ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీ) విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు తమ సర్వీసు క్రమబద్ధీకరించాలని 10 రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో పాలన స్తంభించింది. మండల పరిషత్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఇతర శాఖల సిబ్బందికి పంచాయతీల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా.. వారు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండటం లేదు. మారుమూల గ్రామాల్లోకి అసలు వెళ్లడమే లేదు. దీంతో గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాల తలుపులు మూసే ఉంటున్నాయి. దీంతో పల్లెల్లో పనులను పర్యవేక్షించే వారు కరువయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య ఎక్కువైంది. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు నమోదు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఆసరా పింఛన్ల పంపిణీలో వేలిముద్ర పడని వృద్ధులతోపాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఇన్‌చార్జిలను నియమించాం..

జిల్లా, మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బందికి పంచాయతీల బాధ్యతలు అప్పజెప్పాం. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- రమణమూర్తి, డీపీఓ, మేడ్చల్ జిల్లా

రోజూ పంచాయతీకి వెళ్తున్నా..

ఇంట్లో నేను ఒక్క దాన్నే ఉంటాను. ఆసరా పింఛన్‌తోనే బతుకుతున్నా. ప్రతినెలా కార్యదర్శి డబ్బులు ఇచ్చేవారు. ఈ నెలలో ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదు. సరుకులు, మందులు కొందామంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రతిరోజూ పంచాయతీ కార్యాలయానికి వెళ్తున్నా.

- రాములమ్మ, వృద్ధురాలు, బోమ్మరాసుపేట

జనన ధ్రువీకరణ పత్రం కోసం తిప్పలు

నా కుమారుడి జనన ధ్రువీకరణ పత్రం కోసం నాలుగు రోజుల క్రితం ఏదులాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లా. కార్యదర్శి సమ్మెలో ఉండటంతో గ్రామ పంచాయతీ తలుపులు మూసి ఉన్నాయి. ఫోన్‌లో సంప్రదించగా సమ్మెలో ఉన్నట్లు చెప్పారు. ఎవరిని సంప్రదించాలో తెలియడం లేదు.

- మౌనిక, ఏదులాబాద్

మూడు నెలల వేతనాలు రాలేదు

ఔట్ సోర్సింగ్ కార్యదర్శు(ఏపీఎస్)లకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు రాలేదు. పది రోజులుగా సమ్మె చేస్తున్నా.. పట్టించుకోవటం లేదు. జేపీఎస్‌లకు నెలకు రూ.28 వేలు, ఏపీఎస్‌లకు రూ.15 వేలు మాత్రమే వేతనం అందుతోంది. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

- భాషా, ఏపీఎస్, తుర్కపల్లి

క్రికెట్ కిట్స్ పంపిణీ

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో క్రికెట్ కిట్స్ పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొని రెండు టీమ్స్‌కు కిట్స్ అందజేశారు. యువకులు, విద్యార్థులు వేసవి శిబిరాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమలలో జైకృష్ణ, నర్సింగ్, ప్రదీప్, శ్రీనివాస్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై చైతన్యం తీసుకురావాలి

అల్వాల్: వినియోగదారుల హక్కులు పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మల్కాజిగిరి పార్లమెంటరి వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు అన్నారు. ఆదివారం అల్వాల్‌లో జరిగిన మల్కాజిగిరి పార్లమెంటరి జనరల్ బాడీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ధరలు, సేవలు వినియోగదారులకు పొందాల్సిన వాటిపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారుల హక్కుల పట్ల చైతన్యం తీసుకురావాలని సూచించారు. సంఘం ప్రతినిధులు శివకుమార్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతో రాజ్యాంగానికి ప్రమాదం



మాట్లాడుతున్న ఎస్.బాలమల్లేష్

అల్వాల్: బీజేపీ పాలనలో లౌకిక ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాష్ట్రాల హక్కులు హరించబడుతున్నాయని, రాజ్యాంగ మూలలకు తీవ్ర ప్రమాదం ముంచుకొచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ అన్నారు. ఆదివారం యాప్రాల్‌లో జరిగిన ఇంటింటికీ సీపీఐ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుతానికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదన్నారు. ఈ దేశానికి మనుధర్మమే గొప్పదంటూ ఆర్ఎస్ఎస్ నాయకులు చెబుతున్నారని పేర్కొన్నారు. సోషలిస్ట్, సెక్యులర్ పదాలను రాజ్యాంగం నుంచి తొలగించాలని కేంద్ర ముంత్రులు సైతం చెబుతూ రాజ్యాంగాని మార్చాలని చెప్పడం తీవ్రంగా వ్యతిరేకించారు. దేశంలో ముస్లిం, క్రిస్టియన్లు, దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు జరుగున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు ఇచ్చిన హామీలను అమలు పర్చడంతో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి, నాణ్యత పాటించాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ హైవే రోడ్డులో ఏజే గ్రాండ్ బిర్యాని హోటల్‌ను ఆదివారం మంత్రి మల్లారెడ్డి, స్థానిక మేయర్ జక్కా వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వినియోగదారులకు రుచి, శుచి, నాణ్యత కలిగిన తాజా ఆహార పదార్థాలను అందిస్తే వ్యాపారం అభివృద్ధి చెందుతుందన్నారు. కష్టపడి పనిచేస్తే ఏ వృత్తిలోనైనా రాణించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఏజే గ్రాండ్ అధినేత ఎంఏ ముజీబ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.